క్లుప్తంగా

విద్యుత్ మోటార్లతో రైతులు అప్రమత్తంగా ఉండాలి

కురిచేడు: రైతులు తమ పంట పొలాలకు నీరు పెట్టుకునేందుకు కాలువలపై, వాగులపై ఏర్పాటు చేసుకున్న విద్యుత్ మోటార్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్సై శ్రీకాంత్ సూచించారు. స్థానిక సూరీదుబాటలోని వాగుపై విద్యుత్ మోటార్లు చోరీకి గురికావటంతో రైతులు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. రైతులు మోటార్లు పెట్టిన తర్వాత వాటిని గమనిస్తూ ఉండాలని, కొత్తవారు ఎవరైనా ఆ ప్రాంతంలో సంచరిస్తున్నట్లు అనుమానం వస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని కోరారు.

గుంటి గంగ ఆలయంలో విచారణ

తాళ్లూరు (దర్శి): మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం గుంటి గంగ ఆలయంలో అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి విచారణ జరిపారు. పూర్తి వివరాలు.. గుంటి గంగ అలయం పక్కన ఉన్న నాగేంద్రుని పుట్ట మొదటి నుంచి ఆలయం పరిధిలోనే ఉంటోంది. ఇటీవల కొందరు ప్రైవేటు వ్యక్తులు పుట్ట తమ స్థలంలో ఉందని స్వాధీనంలో ఉంచుకుని పుట్ట ద్వారా వచ్చే ఆదాయం వారే అనుభవించేదుకు చూస్తున్నారని ఫిర్యాదులు ఇచ్చారు. దీంతో శ్రీనివాసరెడ్డి విచారణ చేపట్టారు. పుట్ట మొదటి నుంచి ఎండోమెంట్ పరిధిలో ఉందని, ఇప్పుడు మీకు ఎలా వస్తుందని, వివాదాలకు పోవద్దని చెప్పారు. వారందరికీ వివాదాలు లేకుండా సర్ది చెప్పినట్లు శ్రీనివాసరెడ్డి తెలిపారు. విచారణ సమయంలో సూపరింటెండెంట్ సుధాకర్, ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, ఈఓ కార్తీక్, ఆలయం చైర్మన్ గురుబ్రహ్మం పాల్గొన్నారు.


ఘనంగా ఫొటోగ్రాఫర్ల దినోత్సవం

త్రిపురాంతకం: ప్రపంచ ఫొటోగ్రాఫర్స్ దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. త్రిపురాంతకం సాయిచరణ్ స్టూడియోలో ఫొటోగ్రాఫర్లు ఈ కార్యక్రమం నిర్వహించారు. కెమెరా ఫొటోగ్రఫీతో ఎంతో మందికి ఉపాధి లభిస్తుందన్నారు. మూడు తరాల జ్ఞాపకాలను ఫొటో భద్రపరుస్తుందని వారు ఈ సందర్భంగా పేర్కొన్నారు. మండలంలోని ఫొటోగ్రాఫర్లు వెంకటేశ్వర్లు, అంజిరెడ్డి, శ్రీను, పాలంకయ్య, రవి కుమార్, బాషా, అశోక్ పాల్గొన్నారు.

విద్యా వ్యవస్థ పటిష్టత కోసమే పాఠశాలల సముదాయం

యర్రగొండపాలెం: విద్యా వ్యవస్థను పటిష్టం చేయడం కోసమే పాఠశాలల సముదాయాలు నిర్వహిస్తున్నట్లు ఎంఈవోలు పి.ఆంజనేయులు, బి.మల్లా నాయక్ అన్నారు. సోమవారం బోయలపల్లి, వీరభద్రాపురం పాఠశాలల్లో జరుగుతున్న స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను వారు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలల కాంప్లెక్స్ సమావేశాల్లో నేర్చుకున్న అంశాలను తమ పాఠశాలల తరగతి గదుల్లో అనుసరించాలని ఆదేశించారు. విద్యా ప్రవేశం, విద్యాంజలి, టీచ్ టూల్, ఫిరికి లాంటి కార్యక్రమాలపై ఉపాధ్యాయులు అవగాహన పెంచుకొని విద్యార్థులకు బోధించాలన్నారు. సమావేశాలకు హాజరైతే కొత్త అంశాలను తెలుసుకునే అవకాశం ఉంటుందన్నారు.

మీ కోసంలో 13 అర్జీలు దాఖలు



అర్జీలు స్వీకరిస్తున్న రవీంద్రారెడ్డి

మార్కాపురం టౌన్: మార్కాపురం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీకోసంలో అర్జీలను ఏఓ రవీంద్రారెడ్డి స్వీకరించారు. వివిధ సమస్యలపై 13 అర్జీలు వచ్చినట్లు చెప్పారు. తన పొలానికి పాస్‌బుక్ మంజూరు చేయాలని బి.తిరుపాల్‌రెడ్డి, తనకు చెందిన 76 సెంట్ల భూమిని ఆన్‌లైన్ చేయాలని లక్ష్మీసాయి, దోర్నాల, యడవల్లి గ్రామాల్లో తాను కొనుగోలు చేసిన 82 సెంట్ల భూమిని ఆన్‌లైన్ చేయాలని ఎనిబెర చిన్నజాను విజ్ఞప్తి చేశారు. మరికొందరు వ్యక్తులు కూడా తమ సమస్యలపై అర్జీలు అందజేశారు.

దత్తాత్రేయ మందిరంలో అరుణకేతుక యజ్ఞం



యాగం నిర్వహిస్తున్న వేద పండితులు

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణంలోని గురుదత్త సంస్థాన్ ఆధ్వర్యంలో అరుణకేతుక చయన ఐంద్రాగ్న నిరూఢ యజ్ఞం ఘనంగా నిర్వహిస్తున్నారు. సోమవారం రెండో రోజు రాష్ట్రంలోని పలువురు వేద పండితులు హాజరై దత్తాత్రేయ హోమాలు, యజ్ఞాలు నిర్వహిస్తున్నారు. ఆలయ అర్చకుడు బి.సుబ్రమణ్యం ఆధ్వర్యంలో వేద పండితులు పూజలు చేస్తున్నారు. మంగళవారం ఇంద్ర వైమృధ యాగం, అగ్ని షోమియ యాగాలను బ్రహ్మశ్రీ మద్దూరి యజ్ఞనారాయణశాస్త్రి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. పలువురు భక్తులు పూజ కార్యక్రమాల్లో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ అభివృద్ధికి భక్తులు సహకరించాలని ప్రతినిధులు గొలమారి శివారెడ్డి, రాఘవ తదితరులు విజ్ఞప్తి చేశారు.

ఘనంగా రాఖీ పండగ



యర్రగొండపాలెం: తోటి విద్యార్థులకు రాఖీ కడుతున్న చిన్నారులు



ముండ్లమూరులో అన్నకు రాఖీ కడుతున్న చెల్లెలు

యర్రగొండపాలెం: రాఖీ పండగను సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా అక్కా, చెల్లెళ్లు తమ అన్నాదమ్ములకు రాఖీ కట్టి తమ ఔనత్యాన్ని చాటుకున్నారు. స్థానిక రెయిన్‌బో హైస్కూల్లో చిన్నారులు తోటి విద్యార్థులకు రాఖీ కట్టి వేడుకలు జరుపుకున్నారు. వేడుకల్లో ఎంపీపీ, ఆ స్కూల్ చైర్మన్ దొంతా కిరణ్‌గౌడ్, కరస్పాండెంట్ కిశోర్‌గౌడ్, ప్రిన్సిపాల్ నిఖిల, కొమ్ము రవి పాల్గొన్నారు.

ముండ్లమూరు: రాఖీ పౌర్ణమి సందర్భంగా రక్షా బంధన్ వేడుకలు సోమవారం మండలంలో ఘనంగా జరుపుకున్నారు. సోదరి భావానికి ప్రతీకగా నిలిచే ఈ పర్వదినాన్ని చిన్నారులు, పెద్దలు అనే తేడా లేకుండా మహిళలు అన్నదమ్ముల అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ రాఖీలు కట్టుకొని ఆనందంగా గడిపారు. పాఠశాలల్లో విద్యార్థులు రాఖీ వేడుకలు ఉత్సాహంగా జరుపుకున్నారు.

ప్రకృతి వ్యవసాయానికి ప్రాధాన్యం ఇవ్వాలి



మాట్లాడుతున్న రామ్మోహనరావు

తాళ్లూరు (దర్శి): ప్రకృతి వ్యవసాయానికి ప్రాధాన్యం ఇచ్చి సాగు కర్చులు తగ్గించుకుని అధిక దిగుబడులు పొందాలని ఏట జిల్లా వనరుల కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ ఎ.రామమోహన్‌రావు సూచించారు. మండలంలోని తూర్పుగంగవరం, నాగంబొట్లపాలెం రైతు సేవా కేంద్రాల్లో రైతులకు సోమవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా రామమోహన్‌రావు మాట్లాడుతూ భూసార పరీక్షలు ఆధారంగా సమతుల ఎరువులు వాడాలని సూచించారు. విచక్షణారహితంగా ఎరువులు, పురుగుమందులు వాడరాదన్నారు. డీఆర్సీ టెక్నికల్ ఏఓ ఏ.శైలజారాణి మాట్లాడుతూ మన నేలల్లో ఉన్న పోషకాలు స్థాయిని బట్టి లోపం ఉన్న పోషకాలను నేలకు అందించాలని, అదే విధానంలో జీవన ఎరువులు వాడాలని సూచించారు. డీఆర్సీ ఏఓ వీ.వెంకటశేషమ్మ, వ్యవసాయాధి ప్రసాద్‌రావు, ప్రకృతి సాగు ఇన్‌చార్జి పి.నరసింహులు మాట్లాడుతూ ప్రకృతి సాగు సూత్రాల గురించి వివరించారు. ఎన్ఎస్కే ద్రావణం తయారీ గురించి తెలియజేశారు. ప్రకృతి సాగు విధానం పుస్తకాలు రైతులకు అందజేశారు. వీఏఏలు కె.సుమ, డి.శ్రీను రైతులు పాల్గొన్నారు.

కుళాయిల ఏర్పాటుకు సర్వే పూర్తి చేయాలి



సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీఓ జనార్దన్

ముండ్లమూరు: జలజీవన్ మిషన్ ద్వారా మండలంలో ప్రతి ఇంటికి తాగు నీరు అందించే లక్ష్యంతో ఇంటింటా సర్వే పూర్తి చేయాలని ఎంపీడీఓ ఆర్.జనార్దన్ ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ప్రతి పంచాయతీలో ఇంటింటా సర్వే ప్రారంభించి వీలైనంత త్వరగా పూర్తి చేయాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు సమన్వయంతో సర్వే చేపట్టాలన్నారు. ఈ నెల 23న మండలంలోని అన్ని గ్రామాల్లో పనుల ఎంపిక కోసం ఉపాధి హామీ పథకం గ్రామ సభల నిర్వహణకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. సమావేశంలో పంచాయితీరాజ్ ఏఈ వెంకటేశ్వరరావు, ఈఓఆర్డీ శ్రీదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

హిందూ సంఘాల నిరసన ర్యాలీ



నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న హిందువులు

త్రిపురాంతకం: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న మారణకాండకు నిరసనగా హిందూ సంఘాలు, విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ జరిగింది. త్రిపురాంతకంలోని మార్కాపురం రోడ్డులో ఆంజనేయస్వామి ఆలయం నుంచియువకులు శాంతియుత ర్యాలీగా బయల్దేరి బ్రహ్మంగారి కాలనీ తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ భ్రమరాంబకు వినతి పత్రం అందజేశారు. హిందూ సంఘాలకు చెందిన ప్రతినిధులు కేపీ రమణారెడ్డి, నాగిరెడ్డి, కె.పిచ్చయ్య, సునీల్‌కుమార్, సుబ్రహ్మణ్యం, రమేష్, కృష్ణ, మధు, హనుమంతరావు, శ్రీను, గురుస్వామి, శేఖర్ పాల్గొన్నారు.

ఇసుక కొరతను నివారించి ధర తగ్గించాలి



రెవెన్యూ అధికారులకు అర్జీ ఇస్తున్న తాపీ మేస్త్రీల సంఘ నాయకులు

మార్కాపురం: మార్కాపురం పట్టణంలో ఇసుక కొరతను నివారించి, ధర తగ్గించి ఇవ్వాలని కోరుతూ తాపీ మేస్త్రీల సంఘం, తాపీ వర్కర్స్ ఆధ్వర్యంలో సోమవారం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. సీపీఐ జిల్లా నాయకుడు అందె నాసరయ్య అధ్యక్షుడు రామిరెడ్డి, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్‌కే ఖాశీం ఆధ్వర్యంలో ఇచ్చిన వినతిపత్రంలో పట్టణంలో ఇసుక సరఫరా సక్రమంగా లేనందున భవన నిర్మాణ కార్మికులు పనులు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ధర విషయంలో ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకోవాలన్నారు. ఇసుక సరఫరా విధానం మారుస్తామని చెప్పి అలాంటిదేమీ చేయలేదని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మిక సంక్షేమ పథకాలను కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి



రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి కోట నాయక్

యర్రగొండపాలెం: వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే సీజనల్ వ్యాధులకు దూరంగా ఉండే అవకాశం ఉందని వెంకటాద్రిపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కోటనాయక్ అన్నారు. సోమవారం మండలంలోని వీరభద్రాపురంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ ఇంటి పరిసరాల్లో ఉన్న మురికి కాలువలు శుభ్రంగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని, నీటి నిల్వలు లేకుండా చూడాలన్నారు. వైద్యశిబిరం 128 మందికి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. మండల పరిషత్ ఉపాధ్యక్షుడు మందుల ఆదిశేషు, ఎంపీటీసీ పి.వెంకటనారాయణ, సర్పంచ్ ముటుకూరి అరుణ కుమారి పాల్గొన్నారు.

శ్రావణ పౌర్ణమికి ఆలయాల్లో ప్రత్యేక పూజలు



త్రిపురాంతకేశ్వరస్వామి ఆలయం వద్ద పూజలు చేస్తున్న భక్తులు

త్రిపురాంతకం: శ్రావణ పౌర్ణమి సందర్భంగా శ్రీత్రిపురాంతకేశ్వరస్వామి వారి ఆలయం వద్ద గిరి ప్రదక్షిణలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. త్రిపురాంతకంలోని కుమారగిరిపై ఉన్న శ్రీపార్వతి సమేత త్రిపురాంతకేశ్వరస్వామి వారి ఆలయం వద్ద ప్రతి పౌర్ణమికి గిరి ప్రదక్షిణ జరుగుతుంది. శ్రావణ పౌర్ణమి సందర్భంగా పెద్ద సంఖ్యలో వచ్చిన భక్తులు కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం శ్రీత్రిపురాంతకేశ్వరస్వామికి అభిషేకాలు నిర్వహించారు. శ్రీత్రిపురాంతకేశ్వరస్వామికి ప్రత్యేకంగా లక్ష బిల్వార్చన ప్రత్యేక పూజలు చేశారు.

ప్రత్యేక పూజలు

త్రిపురాంతకంలోని శ్రీబాలాత్రిపురసుందరీదేవి ఆలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అమ్మవారి ఆలయంలో నవధాన్యార్చన, లక్ష కుంకుమార్చన కార్యక్రమాన్ని జరిపించారు. ఆలయాల అర్చకులు ప్రసాదశర్మ, శివనారాయణశాస్త్రి భక్తులకు ప్రత్యేక పూజలు జరిపించారు.

నేడు సర్వసభ్య సమావేశం

పెద్దారవీడు: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం సమావేశం హాలులో ఎంపీపీ బెజవాడ పెద్ద గురవయ్య అధ్యక్షతన మంగళవారం ఉదయం 11 గంటలకు సర్వసభ్య సమావేశం జరగనున్నట్లు ఎంపీడీఓ రాజ్‌కుమార్ సోమవారం తెలిపారు. సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ హాజరవుతారని, జెడ్పీటీసీ, సర్పంచులు, ఎంపీటీసీలు, మండల స్థాయి అధికారులు తమ శాఖలకు సంబంధించిన రికార్డులతో తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగులకు గుర్తింపు కార్డులు



మాట్లాడుతున్న జిల్లా మాజీ సైనికుల వెల్ఫేర్ అధికారి రజనికుమారి

బేస్తవారిపేట: రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగులకు గుర్తింపు కార్డులను వెంటనే మంజూరు చేస్తామని జిల్లా మాజీ సైనికుల వెల్ఫేర్ అధికారి ఎం రజనికుమారి అన్నారు. స్థానిక మాజీ సైనికుల సంక్షేమ సంఘ కార్యాలయంలో సోమవారం మాజీ సైనికులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మాజీ సైనికులు ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాలన్నింటికీ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పిల్లలకు ఉపకార వేతనాలు, పిల్లల వివాహానికి నిధులు విడుదల, నివేశన స్థలాలకు దరఖాస్తు చెట్టుకోవాలని సూచించారు. ఇంటి పన్ను, వితంతు పింఛన్, పింఛన్ మంజూరుపై ఎవైనా సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరిస్తామన్నారు. బేస్తవారిపేటలో ప్రస్తుతం ఉన్న మాజీ సైనికుల కార్యాలయం స్థలం జెడ్పీ నుంచి అనుమతులు ఇప్పించాలని కోరారు. స్థలం మంజూరు చేస్తే నూతన భవనం నిర్మిస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ సైనికుల సంక్షేమ సంఘ అధ్యక్షుడు బొల్లా బాలిరెడ్డి, నాయకులు సీహెచ్ వెంకటరెడ్డి, పూనూరు గురువారెడ్డి, షేక్ వలి పాల్గొన్నారు.

పైప్‌లైన్ లీకేజీతో సాగర్ నీరు వృథా



వృథాగా పోతున్న సాగర్ నీరు

పొదిలి: స్థానిక శ్రావణి ఎస్టేట్‌లో పైప్‌లైన్‌కు లీకేజీ ఏర్పడటంతో సాగర్ నీరు వృథాగా పోతోంది. గత కొన్ని రోజులుగా నీరు వృథాగా పోతున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. మరో వైపు సైడు కాలువల్లోని మురుగుతో కలిసి సాగర్ నీరు రోడ్డుపైకి చేరుతోంది. దీంతో వెంకటేశ్వరస్వామి ఆలయానికి వెళ్లే భక్తులు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పైప్‌లైన్‌కు మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

అంతరాయం లేకుండా విద్యుత్‌ను అందించాలి

బేస్తవారిపేట: అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేయాలని ఒంగోలు విద్యుత్‌శాఖ ఎస్ఈ కేవీజీ సత్యనారాయణ అన్నారు. స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్‌ను సోమవారం తనిఖీ చేశారు. కంభం, అర్ధవీడు, బేస్తవారిపేట మండలాల విద్యుత్‌శాఖ ఏఈలు, సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. బేస్తవారిపేట పట్టణంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఎక్కువ ఉంటుందని సమాచారం అందుతుందన్నారు. విద్యుత్ సరఫరాలో సమస్య ఏ ట్రాన్స్‌ఫార్మర్ పరిధిలో జరిగితే అక్కడనే ఎల్‌సీ తీసుకోవాలని సూచించారు. టౌన్ మొత్తానికి విద్యుత్ సరఫరాను ఎట్టి పరిస్థితుల్లో నిలిపివేయవద్దని సూచించారు. రైతులకు వ్యవసాయ బోర్లకు సక్రమంగా విద్యుత్ సరఫరా చేయాలని, కొత్త వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌లు సకాలంలో మంజూరు చేయాలన్నారు. బేస్తవారిపేట పట్టణంలో 5 ఎంవీఏ అదనంగా ఏర్పాటు చేయడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడదని తెలిపారు. సబ్‌స్టేషన్‌లో పనిచేసే ఉద్యోగులకు మౌలిక సదుపాయాలు, సబ్‌స్టేషన్ చుట్టూ ముళ్ల కంచె ఏర్పాటు చేస్తామన్నారు. ఏడీఏ సియానాయక్, ఏఈలు సన్యాసిరావు, నరసయ్య, నారాయణరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు ఇంగ్లిష్ భాషపై పట్టు సాధించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ-2 సుబ్రహ్మణ్యం

పెద్దారవీడు: ఇంగ్లిష్ భాషపై పట్టు సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈఓ-1 పి.శ్రీనివాసులు, ఎంఈఓ-2 సుబ్రహ్మణ్యం అన్నారు. మండల పరిధిలోని దేవరాజుగట్టు, ఏనుగులదిన్నెపాడు గ్రామాల్లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయులకు ఇంగ్లిష్ సబ్జెక్టు కాంప్లెక్స్ సమావేశం సోమవారం నిర్వహించారు. ఎంఈఓలు మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు బోధన పద్ధతుల్లో వచ్చే మార్పులు, పాఠ్య ప్రణాళికలు తయారు చేయుటలో మెళకువలు, టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ తయారు చేయుటలో శిక్షణ, సెల్ఫ్ అసెస్మెంట్ పరీక్ష విధానం గురించి వివరించారు. పాఠశాలలో అందుబాటులో ఉన్న ఇటర్ బోర్డు సమర్థంగా వినియోగించుకొనుట, రోజు వారి తమ బోధనా అభ్యసన ప్రక్రియలో ఎదురయ్యే సమస్యలపై చర్చించారు. కాంప్లెక్స్ చైర్మన్ అహ్మద్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు పాఠ్య ప్రణాళికలను స్వయంగా తయారు చేసుకుంటే విద్యార్థులకు చాలా ఉపయోగకరంగా ఉంటుందన్నారు. విద్యార్థుల భాషాభివృద్ధిని అంచనా వేసుకుంటూ దానికి తగిన విధంగా యాక్టివిటీస్ బోధనలో ఉపయోగించుకుంటే మంచి ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. సమావేశంలో కాంప్లెక్స్ సెక్రటరీ జీవీ కృష్ణారెడ్డి, రిసోర్స్ పర్సన్లు రమణయ్య, ఆర్‌పీబీ శ్రీనివాస్, వంకేశ్వరం శ్రీనివాస్, పెద్దారవీడు, పెద్దదోర్నాల మండలాల నుంచి 22 మంది ఇంగ్లిష్ ఉపాధ్యాయులు, 30 మంది ఎంపీపీ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైద్య విద్యార్థిని హంతకులను అరెస్టు చేయాలి



విద్యార్థులతో ర్యాలీ చేస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

- మహిళా డాక్టర్‌లకు భద్రత కల్పించాలి
- డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కేవీ పిచ్చయ్య

దర్శి: వైద్య విద్యార్థిని హత్య కేసుపై సమగ్ర దర్యాప్తు చేపట్టి నిందితులను వెంటనే అరెస్టు చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కేవీ పిచ్చయ్య డిమాండ్ చేశారు. సోమవారం డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ ఐద్వా సంఘాల ఆధ్వర్యంలో విద్యార్థులతో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పిచ్చయ్య మాట్లాడుతూ మహిళా డాక్టర్‌పై అత్యాచారం చేసిన నిందితులను అరెస్ట్‌చేయకుండా మమతా బెనర్జీ ఆందోళనకు దిగటం సరైన పద్ధతి కాదన్నారు. వెంటనే నిందితులను అరెస్టు చేయాలని, దేశంలో ఉన్న మహిళా డాక్టర్‌లకు రక్షణ కల్పించాలని కోరారు. డీవైఎఫ్ఐ మాజీ నాయకులు సందు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ బాలికలపై, మహిళలపై రోజు రోజుకూ అత్యాచారాలు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ఒక కమిటీని ఏర్పాటు చేసి అత్యాచార ఘటనలు జరక్కుండా చూడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ శ్రావణ్‌కుమార్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. డీవైఎఫ్ఐ మండల అధ్యక్షుడు ఆర్.జేసీపాల్, డీవైఎఫ్ఐ మండల నాయకులు షేక్ పీరా సాహెబ్, కె.వెంకట్రావు, గోపి పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



గురువులతో పూర్వ విద్యార్థులు

బేస్తవారిపేట: మండలంలోని పిటికాయగుళ్ల జెడ్పీ హైస్కూల్‌లో 1997-98 పదోవ తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం సోమవారం నిర్వహించారు. చిన్ననాటి స్నేహితులు ఒక చోటకు చేరి ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. ఆటపాటలతో సంతోషంగా గడిపారు. చదువు చెప్పిన గురువులను శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. గురువుల వద్ద ఆశీర్వాదం తీసుకున్నారు. ఆనాటి జ్ఞాపకాలను పంచుకుంటూ పరిచయం చేసుకున్నారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న యూనియన్ సభ్యులు

పొదిలి: ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా పొదిలి తాలూకా ఫొటో అండ్ వీడియోగ్రాఫర్స్ ఓల్డ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం పేద కుటుంబాల వారికి దుప్పట్లు పంపిణీ చేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు రావూరి శ్రీకాంత్ ఆధ్వర్యంలో దర్శి రోడ్డులోని శ్రీపతి నగర్ కాలనీవాసులకు 40 మందికి దుప్పట్లు పంపిణీ చేశారు. సీనియన్ ఫొటోగ్రాఫర్ సీహెచ్.శ్రీనివాసులను శాలువా, పూలదండలతో సన్మానించారు. కార్యక్రమంలో కోశాధికారి అశోక్, జి.శ్రీనివాసులు, సీహెచ్ శ్రీనివాసులు, కృష్ణ, వి.శ్రీనివాసులు, శ్రీధర్, ప్రవీణ్, దేవా, వెంకటేశ్వర్లు, వెంకటరావు, రాజు, సురేంద్ర, అభి, శ్రీనన్న తదితరులు పాల్గొన్నారు.

బాలికకు ఆర్థిక సాయం



ఆర్థిక సాయం చేస్తున్న వారణాసి గిరిధర్‌శర్మ

రాచర్ల: మండలంలోని గుడిమెట్ట ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న ఎం.లక్ష్మి కళ్యాణి అనే చిన్నారి బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతోంది. ఆ బాలికకు మూడేళ్లుగా చికిత్స చేయిస్తున్నారు. విషయం తెలుసుకున్న పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి.రాజగోపాల్‌రెడ్డి బాలికల తల్లిదండ్రుల ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నారని విద్యాశాఖాధికారులకు తెలియజేయగా మండలంలోని ఉపాధ్యాయులు కలిసి రూ. 67 వేలు, గిద్దలూరు మండల ఉపాధ్యాయులు, గిద్దలూరు మండల ఎంఈఓలు జింకా వెంకటేశ్వర్లు, కావడి వెంకటేశ్వర్లు కలిసి రూ.62 వేలు, సబ్జెక్టు ఉపాధ్యాయులు రూ.16 వేలు, రాచర్ల, గిద్దలూరు మండలాల ఉపాధ్యాయులు కలిసి రూ.46 వేలను చిన్నారికి వైద్య సహాయ ఖర్చుల కోసం రాచర్ల విద్యాశాఖాధికారులు వారణాసి గిరిధర్‌శర్మ, శివకోటేశ్వరరావు చేతులు మీదుగా బాలిక తల్లిదండ్రులు రామకృష్ణరెడ్డి, పార్వతీలకు అందజేశారు.